● సీఎం సహాయనిధి ఎల్వోసీ అందజేత



మీర్‌పేట్ 9వ డివిజన్‌లోని నందిహిల్స్‌కు చెందిన గునిగంటి దవలయ్యగౌడ్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల విలువగల ఎల్వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు రామిడి నర్సిరెడ్డి

- సరూర్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి)

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

మన్సూరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడతాయని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రగతీనగర్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యులు ముందుకు వచ్చి సీసీకెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కొప్పుల నర్సింహారెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అర్జున్ రావు, సభ్యులు సైదిరెడ్డి, రాంరెడ్డి, విద్యాసాగర్, రాధాకృష్ణ మూర్తి, విశ్వేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'కొత్తపేటలో సమస్యలు పరిష్కరించండి'

కొత్తపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలో ఎలక్ట్రిక్ బైక్ సర్వీస్ సెంటర్ వద్ద వాహనాలు పార్కింగ్ చేయడంతో తలెత్తుతున్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్, కాలనీల ప్రతినిధులు జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించారు. జడ్సీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో వారు సమస్యలను విన్నవించారు. అదేవిధంగా న్యూ నాగోల్ కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎలక్ట్రిక్ బైక్ సర్వీస్ సెంటర్ జీహెచ్ఎంసీ, సంబంధిత శాఖల నుంచి అనుమతులు లేవని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు.

ఆహ్లాదాన్ని కల్పించేలా పార్కుల అభివృద్ధి



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్

సంతోష్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించేలా పార్కులను అభివృద్ధి చేస్తామని హస్తినాపురం కార్పొరేటర్ సుజాతా నాయక్ తెలిపారు. డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలో రూ. 8లక్షలతో అర్బర్ బయోడైవర్సీ వారి ద్వారా మంజూరు చేయబడిన నిధులతో పార్కు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సంక్షేమ సంఘ నాయకులు వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్‌గుప్తా, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం షురూ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జనవరిలో జరుగనున్న తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం సోమవారం ప్రారంభమైంది. ప్రచారంలో భాగంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది, తెలంగాణ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.రఘునాథ్ రంగారెడ్డి జిల్లా కోర్టును సందర్శించి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా తాను ముందుకెళ్తున్నాని ఆయన చెప్పారు. రాబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన న్యాయవాదులను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

65 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో 65 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో లెక్చర్‌హాల్‌లో సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెలిపారు. మద్యం అనర్థాలపై సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు, మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కోచ్‌గా స్వాములు



అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బాటసింగారం జడ్పీహెచ్ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ సోల పోగుల స్వాములు ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ ఏ.ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. 69వ అఖిల భారత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిసెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరుగనున్న క్రీడా పోటీల్లో స్వాములు కోచ్‌గా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు స్వాములను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మైత్రి కుటీర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలోని మైత్రి కుటీర్ గేటెడ్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎడ్ల నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుద్దాల ఎల్లయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా మేక మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా విస్నుకోట రామ్మోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రవీందర్‌రెడ్డి, పవన్‌నాయక్, టీవీఎస్ సూర్యనారాయణ రాజు, నరసింహారావు, జీహెచ్ రంగారెడ్డి, ఉప్పల వెంకటేశ్వర్లు, సీహెచ్ నాగ మురళీకృష్ణ, నిర్మల్‌కుమార్, వీరప్రసాద్, వెంకటేశ్వరరావు, రవీందర్, వెంకటేశ్వర్లు తదితరులను ఎన్నకున్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఆల్‌పార్టీ నాయకులు

ఎస్టీపీ పనులు అడ్డుకుంటారని ఆల్‌పార్టీ నాయకుల ముందస్తు అరెస్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 292లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) పనులను అడ్డుకుంటారన్న సమాచారంతో సోమవారం హయత్‌నగర్ పోలీసులు పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. పెద్దఅంబర్‌పేట్ నుంచి మునగనూర్ రోడ్డులో సర్వే నంబర్ 292లో ప్రభుత్వం ఎస్టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది. రెండు వారాల క్రితం అక్కడ పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్, అధికారులు రాగా స్థానికులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం అధికారులు భారీ పోలీసుల బందోబస్తుతో తిరిగి పనులు ప్రారంభించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆల్‌పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి అబ్దుల్లాపూర్‌మెట్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సమీప కాలనీవాసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో వారిని కూడా పోలీసులు అరెస్టు చేసి డీసీఎంలో అబ్దుల్లాపూర్‌మెట్‌కు తరలించారు. ఇళ్ల మధ్యలో కాకుండా కాలనీలకు దూరంగా ఎస్టీపీకి స్థలం చూపించాలని కోరుతూ నాయకులు, కాలనీ వాసులు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎస్టీపీ పనులను తహసీల్దార్ పరిశీలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కృష్ణారెడ్డి, రాంరెడ్డి, రాజు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, జగన్, నాగార్జునతో పాటు కాలనీవాసులు ఉన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- 5 క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు
- 14 సర్పంచ్, 134 వార్డు స్థానాలకు ఎన్నికలు
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 35,585మంది ఓటర్లు, 148 పోలింగ్ కేంద్రాలు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఈ నెల 3 నుంచి సర్పంచ్, వార్డు అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. మండలంలో మొత్తం 14 సర్పంచ్, 134 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనుండగా 148 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఏలాంటి గందరగోళం చోటుచేసుకుకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. 14 గ్రామాలకు సంబంధించి ఎన్నికల్లో పోటీ చేయనున్న సర్పంచ్, వార్డు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ కోసం 5 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు కేటాయించిన క్లస్టర్‌లోనే సర్పంచ్, వార్డు భ్యర్థులు తమ నామినేషన్‌ను దాఖలు చేయాలని అధికారులు తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ స్వీకరించేందుకు సెంటర్‌లో ఒక ఆర్‌వోతో పాటు అసిస్టెంట్ ఆర్‌వో ఉంటారని ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను అధికారులు స్వీకరిస్తారు.

నామినేషన్ క్లస్టర్ల వివరాలు

అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ కోసం అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, బండరావిరాల, అనాజ్‌పూర్, లష్కర్‌గూడను క్లస్టర్లుగా విభజించారు.

- అబ్దుల్లాపూర్‌మెట్ క్లస్టర్‌లో అబ్దుల్లాపూర్‌మెట్, కవాడిపల్లి, బలిజగూడ.
- బాటసింగారం క్లస్టర్‌లో బాటసింగారం, పిగ్లీపూర్, జాఫర్‌గూడ,
- బండరావిరాల క్లస్టర్‌లో బండరావిరాల, చిన్నరావిరాల,
- అనాజ్‌పూర్ క్లస్టర్‌లో అనాజ్‌పూర్, మజీద్‌పూర్, గుంతపల్లి,
- లష్కర్‌గూడ క్లస్టర్‌లో లష్కర్‌గూడ, ఇనాంగూడ, గండిచెరువు

గ్రామాల వారీగా ఓటర్ల సంఖ్య

అబ్దుల్లాపూర్‌మెట్‌లో 14 వార్డులు 10,310 మంది ఓటర్లు, కవాడిపల్లిలో 10 వార్డులు, 2,212 మంది ఓటర్లు, బలిజగూడలో 8 వార్డులు, 688మంది ఓటర్లు, బాటసింగారంలో 12 వార్డులు, 4,500 మంది ఓటర్లు, పిగ్లీపూర్‌లో 8 వార్డులు, 8,51 మంది ఓటర్లు, జాఫర్‌గూడలో 8 వార్డులు, 7,75 మంది ఓటర్లు, బండరావిరాలలో 10 వార్డులు, 2,022 మంది ఓటర్లు, చిన్నరావిరాలలో 8 వార్డులు, 1,350 మంది ఓటర్లు, అనాజ్‌పూర్‌లో 12 వార్డులు, 4,968 మంది ఓటర్లు, మజీద్‌పూర్‌లో 10 వార్డులు, 2,320 మంది ఓటర్లు, గుంతపల్లిలో 8 వార్డులు, 1,013 మంది ఓటర్లు, లష్కర్‌గూడలో 10 వార్డులు 1,906 మంది ఓటర్లు, ఇనాంగూడలో 8 వార్డులు 1,615 మంది ఓటర్లు, గండిచెరువులో 8 వార్డులు 1,055 మంది ఓటర్లు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో తదితరులు

పోలింగ్ ఏర్పాట్లపై ఎంపీడీఓ సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులతో ఎంపీడీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణ, పోలింగ్ రోజు ఎన్నికల నిర్వహణలో ఆర్‌వో, అసిస్టెంట్ ఆర్‌వోలు అనుసరించాల్సిన విధి విధానాలు, పోలింగ్ ఏర్పాట్లు, నిబంధనలు, సమయ పట్టిక, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తదితర అంశాలపై క్షుణ్ణంగా కార్యాచరణ సూచనలు జారీ చేశారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, డీఈఈ ఇంద్రాసేనారెడ్డి, ఏఈఈ సూర్యతేజా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుతాం : అందెల



బీజేపీలో చేరిన వారితో శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని గ్రామాల్లో తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మహేశ్వరం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సోమవారం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు యదీశ్, పార్టీ రాష్ట్ర నాయకుడు కడారి జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో అందెల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేసి అత్యధిక స్థానాల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు రాంరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, తుమ్మటి కృష్ణాయాదవ్, విద్యాసాగర్‌రెడ్డి, ఆంజనేయులు, దేవేందర్, శేఖర్, శ్రీనాథ్, అనిల్, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, చక్రు, బబ్లూ నాయక్, లాలూ నాయక్, నరేందర్, కుమార్, శివ, బన్నీ, విజయ్, శ్రీధర్, భాస్కర్, చిన్నా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, ఎల్బీనగర్ జర్నలిస్టులు

ఎల్బీనగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి డిసెంబరు 3న టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న మహా ధర్నా కరపత్రాన్ని సోమవారం కొత్తపేటలోని బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న మహాధర్నాలో ప్రతీ జర్నలిస్టు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు శ్యామ్‌ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు రచ్చ శేఖర్, దశరథ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మల్లేష్‌గౌడ్, గణేష్, మహేష్, ఉదయ్‌గౌడ్, పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో...

సరూర్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3వ తేదీన తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం యూనియన్ నేతలు బడంగ్‌పేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఆంజనేయులు, మహిపాల్‌రెడ్డి, జయంత్, కె.ప్రమోద్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 3న జర్నలిస్టుల ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, హయత్‌నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం యాదయ్య, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగయ్య, జర్నలిస్టులు జగన్, వెంకటస్వామి, వెంకటేష్‌యాదవ్, అంజనేయులు, రాకేష్, శేఖర్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం చేసి పునరుజ్జీవించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతామహాలక్ష్మి

హయత్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయినప్పుడు అవయవదానం చేసి పునరుజ్జీవించాలని అఖిల భారత అవయవదాతల సంఘం అధ్యక్షురాలు గూడురు సీతామహాలక్ష్మి సూచించారు. హయత్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సోమవారం సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. టాస్క్ ఉపాధ్యక్షుడు ఆర్. నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతామహాలక్ష్మి హాజరై మాట్లాడారు. రక్తదానంతో ప్రాణదానం చేయాలని కోరారు. మరణించిన తరువాత నేత్రదానంతో అంధులకు చూపు ఇవ్వాలన్నారు. శరీర దానంతో వైద్య శిద్యార్థులకు జ్ఞాన సముపార్జనకు సహకరించాలని కోఆరు. విద్యాదానంతో నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆర్.నర్సయ్య తన మరణానంతరం తన దేహాన్ని వైద్యకళాశాలకు అప్పగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అవయవదాన సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.రామచందర్‌రావు, స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరహరి, కైలాస్‌నాథ్, శేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, ధనలక్ష్మీ, మల్లారెడ్డి, హరినాథ్, ముత్తిరెడ్డి, అచ్చయ్య నాయుడు, రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

సరైన అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో డాక్టర్ అనురాధ

మన్సూరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చాపకింద నీరులా వ్యాపించే ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరమని, సరైన అవగాహనతో దీనిని నియంత్రించవచ్చని తెలంగాణ సార్క్ (శాస్త్రీయ, అనువర్తిత కేంద్రం) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ సార్క్ జేడీ డా.అనురాధ విచ్చేసి కామినేని ఆస్పత్రి నుంచి ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వరకు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కామినేని వైద్యుడు డాక్టర్ శ్రీకృష్ణ రాఘవేంద్ర, కామినేని సీనియర్ వైద్యుడు డా.ఎం.స్వామి, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొ.డా.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ డా.సుధీర్‌బాబు, వివిధ విభాగాల వైద్యులు, వైద్యవిద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో..


ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్‌లోని పట్టణ ప్రధాన ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా అదనపు వైద్యారోగ్య అధికారి డాక్టర్ పాపారావు విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.అమిత, డా.అయేష, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్, వైద్యులు డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డా.శ్రీగణ, హెల్త్ సూపర్‌వైజర్ భూషణ్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం యాదగిరి, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కిరణ్, పల్లె దావాఖాన డాక్టర్. కల్పన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఎంపీహెచ్ఎస్ చంద్రశేఖర్, ఏఎన్ఎంలు, సేవా మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

హయత్‌నగర్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వృక్షశాస్త్ర అధ్యాపకుడు యాదగిరి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఇందిర, మధు, నరసింహ, యాదగిరిరెడ్డి, శారదతో పాటు పలువురు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లాలో హెచ్ఐవీ నివారణకు కృషి చేస్తున్న హయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న కౌన్సెలర్ ఎం.వెంకట్ రెడ్డికి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న రంగారెడ్డి జిల్లా ఏడీఎంహెచ్ఓ డాక్టర్ పాపరావు

- హయత్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి)

7న దిల్‌సుఖ్‌నగర్ నుంచి 'విహారయాత్ర స్పెషల్'

చాదర్‌ఘాట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి ఈనెల 7న విహారయాత్ర స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించినట్లు డిపో మేనేజర్ సమత తెలిపారు. 7వ తేదీన ఉదయం 5గంటలకు బయలుదేరే విహార యాత్ర స్పెషల్ బస్సులు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయల్దేరి ముందుగా భద్రకాళి దేవాలయానికి చేరుకుంటుంది. అక్కడ అమ్మవారి దర్శనానంతరం వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయానికి, లక్నవరం లేక్‌ను చేరుకుంటుంది. 40 మంది ప్రయాణికులతో బయలుదేరే మెట్రో డీలక్స్ బస్సులో ఒక్కొక్కరికి పెద్దలకు రూ.950లు, పిల్లలకు రూ.600లు చార్జీలుగా వసూలు చేయనున్నారు. మరిన్ని వివరాల కోసం డిపో సిబ్బంది బుచ్చిరెడ్డి 7989928321, పి.మోహన్‌రావు 9032059920 ద్వారా సంప్రదించాలని సూచించారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి



హయత్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేస్తున్న సత్యనారాయణరెడ్డికి తుర్కయంజాల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం సత్యనారాయణరెడ్డి తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఆర్‌కేపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బాలశ్యామ్‌గుప్తా

ఎల్బీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఉప్పల బాలశ్యామ్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాలశ్యామ్‌గుప్తాను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ బాలశ్యామ్‌గుప్తా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు వెంకటేశం గుప్తా, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌గుప్తా, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మహేష్ గుప్తా, రంగారెడ్డి జిల్లా ఈస్ట్ జోన్ చైర్మన్ కుంచారపు రాజుగుప్తా, కొత్తూరు శ్రీనివాస్, నాగేంద్రయ్య, ఆర్‌కేపురం ఆర్యవైశ్య సంఘం నూతన ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా గీతాజయంతి వేడుకలు

సంతోష్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గీతాజయంతి వేడుకలను సోమవారం చంపాపేటలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి విద్యాపీఠ్ సంస్కృతి స్కాలర్ డాక్టర్ గంగా భార్గవి హాజరై మాట్లాడారు. భగవద్గీత జయంతిని ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో శుద్ధ ఏకాదశిని గీతా జయంతిగా ఆచరిస్తారని, శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి గీతోపదేశం చేసింది ఈ ఏకాదశి రోజునే కాబట్టి గీతా జయంతిగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గీతా శ్లోక పఠనంలో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. గీతా శ్లోకాల పోస్టర్ ప్రదర్శన ద్వారా గీతా సందేశం ప్రాముఖ్యతను విద్యార్థినులు చక్కగా వివరించారు. ప్రిన్సిపాల్ గంధం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రభుత్వ అంధుల పాఠశాల, వసతి గృహాల్లో అడ్మిషన్లు



అంధుల పాఠశాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్

సంతోష్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న మూడు ప్రభుత్వ బాలికల పాఠశాల, వసతి గృహాల్లో నిరంతరం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. సోమవారం మలకపేట బీ-బ్లాక్ కాలనీలోని ప్రభుత్వ అంధుల బాలికల పాఠశాల, వసతిగృహాల్లో అడ్మిషన్లు తక్కువ ఉన్నాయని, ఎప్పుడు వచ్చినా తీసుకునేలా త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తొందరలోనే వసతి గృహాల్లో సిబ్బంది ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డైనింగ్ హాల్, భవన నిర్మాణపనులు పూర్తి అయ్యే విధంగా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఉప విద్యాశాఖ అధికారి సుకన్య, ప్రధానోపాధ్యాయులు ఫాతిమా, రామ్మోహన్, ఐఓఎస్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ మీద పడి ద్విచక్రవాహనదారుడు మృతి

హయత్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీ మీదపడి ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చైతన్యపురి ఇందిరానగర్ కాలనీకి చెందిన పోలమోని శివ యాదవ్(30) సోమవారం రాత్రి 8గంటల సమయంలో తారామత్‌పేట్ వైపు నుంచి పసుమాల వైపునకు బైకుపై వెళ్తున్నాడు. తారామతిపేట్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించేందుకు సడన్ బ్రేక్ వేశాడు. దాంతో అదుపుతప్పిన ట్రాక్టర్ ట్రాలీ బైక్ పై పడింది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు ఎక్స్‌కవేటర్ సహాయంతో బోల్తా పడిన ట్రాలీని పక్కకు జరిపి శివను బయటకు తీశారు. అప్పటికే శివ మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నట్లు పోలీసులు తెలిపారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.